# కన్నీటి కెరటాలు

రచన :
"వాలేకార"

[గత సంచిక తరువాయి]

అయితేళ్ళ ఆకరిపాట గీత ఎవరూ చూడకుండా క్రింద పడ్డ చింతపిక్క తీసి నోట్లో పెట్టుకుంది. ఆ పిక్క కాస్త గొంతులో యిరుక్కుని ఊపిరి ఆడక గిలగిల తన్నుకుని పుక్కిరి బిక్కిరి కాసాగింది. అంతలోనే అన్నా, వదిన కంగారుగా పరుగెత్తుకొచ్చారు.

ఎన్నడూ కోపమన్నదే ఎరుగని అన్నయ్య ఆ రోజు కోపంతో తాండవమాడినట్టు కాంతను నోటికి అడ్డు లేనట్టు తిట్టిపోశాడు.

అది మొదలుకొని వదిన పిల్లల్ని మరి ముట్టుకోనిచ్చేది కాదు. పిల్లలపై ప్రేమ మమకారంకొద్ది ఓ రోజు బయట ఆడుకుంటున్న పాపను ఎత్తుకొని ముద్దాడేలోగ, పాప కంగారుపడి కెవ్వుమని ఏడ్వసాగింది. పాప ఏడ్పు విన్న వదిన వంటింటినుండి పరుగెత్తుకొచ్చి కాంత చేతుల్లోని పాపను విసురుగా లాక్కుని, అయ్యో పిల్లనేం చేశావే? ఇంత గుక్క తిప్పుకోకుండా ఏడుస్తుంది, అని "చూడు కాంత, అలవాటులేనిపనులు నీకెందుకు. పిల్లా? పాపలేని నీవు పిల్లల్ని ఎలా యెత్తుకోవాలో నీకేం తెలుసు. ఒక్క పిల్లనైనా కని, ముద్దు, ముచ్చటా చూశావా? చేశావా? కడుపుతీపి కన్నతల్లికి తెలుస్తుందికాని, నీలాంటి గొడ్రాలి కేం తెలుస్తుంది." అన్న వదిన మాటలకు కాంత శరీర మంతా నీరుకారిపోయింది.

ఏమిటి నా జీవితం? పిల్లలు లేనంతమాత్రాన సొంత అన్న పిల్లల్ని ఎత్తుకొని ఆడించి ఆనందపడే అదృష్టం కూడా నాకు కరువేనా??

భగవాన్ ఏమిటి నీ ఈ పరీక్ష???

ఏం తప్పుచేశానని నా మీద నీకింత కక్ష?

ఎందుకు విధించావు నా కింతటి కఠిన శిక్ష?

ఒకరి జీవితంలో వెలుగూ మరొకరి జీవితంలో చీక టులు నింపి వేడుకలు చూడడం నీకు ధర్మమా? జీవి తములో నేను నిన్నేం కోరాను? నే కోరుకొన్నది ఒకే ఒక బిడ్డను ప్రసాదించమని.

గొడ్రాలు గొడ్రాలు అని నలుగురూ కించపరిచే ఆ మాటల్ని అంతం చేయమని తప్ప నిన్నేం కోరలేదు. అని అనుకుంటూనే ఎదురుగావున్న అన్నపూర్ణమ్మ విగ్రహం ముందు మోకరిల్లి —

అమ్మా అమ్మలగన్న అమ్మవైన అన్నపూర్ణమ్మా! అప న్నులకు అమృతవల్లివై, అసురులకు పరాశక్తివై, వెలిగే వీరమాతా, ఆడదాని బాధను అర్థంచేసుకునే ఆరాధ్య దేవతా, ఒక్క బిడ్డను ప్రసాదించు తల్లీ! పుట్టిన బిడ్డకు నీ పేరు పెట్టుకొంటాను.

ఉదయం పుట్టిన బిడ్డ సాయంత్రమే చచ్చినా
సాయంత్రం పుట్టిన బిడ్డ ఉదయమే చచ్చినా
పురిటిలోనే పోయిన బిడ్డ బాధైనా మరుస్తాను కాని ఈ గొడ్రాలిననే బాధ నేను భరించలేనమ్మా! నేను ఒక్క బిడ్డకు తల్లిననిపించుకొంటే నీకు కుంభాభిషేకం చేయిస్తాను. అని ఆవేశంతో దుఃఖంతో తల గొట్టుకుం టున్న కాంత ఎన్నోరోజులు కన్నీరు మున్నీరుగా కార్చింది.

"శ్రీ వేంకటేశ్వరస్వామి పటంముందు నిలబడి"

ఏడుకొండలపై నిండుగా వెలచిన వేంకటరమణా! ఆపదమ్రొక్కులవాడి వంటారే, అసహాయులను కాపాడే అనాదరక్షకుడివంటారే! దీనురాలినైన నాకు సిరిసంపద లిచ్చి, బంగారంలాంటి భర్తనిచ్చి, గొడ్రాలిననే ముద్ర వేశావా? ఒక్క బిడ్డను వరంగా ఇవ్వలేవా స్వామీ! నాకే ఓ బిడ్డ పుడితే బిడ్డిగా నీకు నిలువుదోపిడి ఇస్తాను. పిల్లలులేని నా జీవితం ఎందుకు? గొడ్రాలివని అందరూ హీనంగా మాట్లాడే ఆ మాటలకు, రోజురోజుకూ కొంచెం కొంచెంగా చచ్చే నా జీవితానికి ఒక్క బిడ్డను ప్రసా దించు, లేదా ఒక్కసారే శాశ్వతమైన మృత్యువునైనా ప్రసాదించు ఆడదానికి అన్నిటికన్నా భర్త ఆదరణ కావాలి. ఆ ఆదరణ పొందాలంటే పిల్లాపాపలు కావాలి. "పిల్లలు లేని నా బ్రతుకెందుకు?" అంటూ ఇలాగే కంటి కెదురుగా వున్న ప్రతి దేవుడిని వరం కోరని దేవుడులేడు. కాంత కన్నీళ్ళు కార్చని రోజు అంతకన్నా లేదు.

ఇలాగే రోజులు గడుస్తున్నవి. ఆరోజు —

కాంతకు తలతిప్పి, కడుపులో దేవినట్టయి, వికారంతో రెండుసార్లు వాంతి చేసుకుంది. అది మొదలు ఎన్నడూ లేని అత్త ఆదరణ, ఎప్పుడూ ఆడిపోసుకునే ఆడపడుచు ఆపేక్ష, భర్త ఆప్యాయత, ఇరుగుపొరుగు వారి గౌరవ మర్యాదలు ఒక్కసారే లభించాయి.

కాలు క్రింద పెడితే పాదాలు కందిపోతాయేమో, అనేంత గారాభంగా అందరూ చూసుకుంటుంటే, ఎందుకో కాంతలో ఓ విధమైన ఆరాటం, మరేదో భయం గూడుకట్టుకోసాగాయి. అందరూ కాంతను పువ్వులా

ముట్టుకొంటే పూలరెమ్మ వాడిపోతుందేమో అని ఆప్యాయత కురిపించేవారు.

రోజురోజుకు కడుపులో బరువుతో నిండే బాధ మరీ ఎక్కువవుతోంది. కాంతకు ఆ బాధ చెప్పతరం కాదు. అంతటి ఆ బాధకన్నా రంపపుకోతే నయమనిపించేది.

తన బాధ ఎవరితో చెప్పుకున్నా! వాళ్ళు నవ్వి తొలి ప్రసవంకదూ అలాగే వుంటుంది. ఇంకా ఇప్పుడేముంది ముందుంది ముసళ్ళపండగ. అనే వారి మాటలకు కాంతమ్మ ఎంతో సిగ్గుపడి ఆ బాధంతా కొద్దిక్షణాలు మరచి తను తల్లి కాబోతున్నాననే ఆనందంలో పుట్టబోయే బిడ్డకోసం తియ్యని కలలుకంటూ కాలంగడిపేది.

ఆనాటి రాత్రి-కడుపు బాధ మరీ ఎక్కువైతే తన్ను డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళమని భర్త నడిగింది.

తను తండ్రి కాబోతున్నానని పులకరించిపోతున్న రామారావ్ కాంతపై పెరిగిన మమకారం కొద్ది వెంటనే ఒప్పుకొని వుదయమే తీసుకెళతానన్నాడు.

ఆనాటి రాత్రంతా ఆనందంలో తేలియాడుతున్న కాంతకు సంతోషంతో నిద్రపట్టక ఇన్నేళ్ళకు తనపూజలు ఫలించాయని ఉదయం డాక్టర్ నోటినుండి వినే ఆ కమ్మని మాటకోసం మనస్సు తహతహలాడుతుంటే బాధలన్ని మరచిపోతున్నది తను!

డాక్టర్, నీవు తండ్రివి కాబోతున్నావు అని అతడితో అనేమాటలు తను విని సిగ్గు దొంతర్లు ముసుగేసుకొని ఇంటికి రాగానే భర్త కౌగిలిలో ఒరిగి, కర్పూరంలా కరిగిపోతుంటే చెప్పలేని ఆ ఆనందం ఎలా వుంటుందోనని రాత్రంతా కాంత మనస్సు రిహార్సిల్స్ చేసుకుంటోంది. ఎంతకూ తెల్లవారని రాత్రిపై ఓ ప్రక్క కోపంతో విసుక్కుంటూ, మరో ప్రక్క తియ్యని ఊహాగానాలు చేసుకుంటూ నిద్రకు ఉపక్రమించింది. తెల్లవారింది.

తొలికోడికూతకే మేలుకున్న కాంత తలంటి స్నానం చేసి పూజ ముగించి తెల్లని, తెల్లని ఎర్రంచు వెంకటగిరి చీరకట్టి అదేరంగు జాకెట్టు తొడిగింది.

చెవులమీద నుండి వ్రేలాడే వదులుగా వేసుకున్న జాలుజడ పిరుదులను తాకుతుంటే తలలో అలంకరించుకున్న గుండు మల్లె దండ సువాసన వెదజల్లుతుంటే ఎన్నడూ ప్రకృతి సౌందర్యాన్ని తిలకించ ఎరుగని కాంత ఉదయ సౌందర్యపు ఆ అందాన్ని చూసి మైమరచిపోయింది.

అరుణకిరణుడు అప్పుడే ఉదయించేవేళ. తూర్పు దిక్కున ఆకాశమంతా ఎర్రని జలతారు చీరచెంగు కప్పుకున్నట్టు రాగరంజితంగా వుంది. రాత్రంతా తన వెలుగును చంద్రునికోసం వినియోగించిన సూర్యుడు చీకటి తెరలను చించుకొని స్వయంప్రకాశంతో వెలుగుతూ కొండల చాటునుంచి తొంగిచూస్తూ వెలికి వచ్చాడు. రక్తపు సముద్రంలో స్నానం చేస్తూ రక్తాన్నంతా అల్లకల్లోలం చేస్తూంటే రక్తపు అలలు ఎగిరిపడుతూ చెదరిపోతున్నట్టు, ఎర్రని మేఘాలు ఆకాశంలో అలుముకుంటున్నాయి. అవి నీలఘనగన మేఘ శకటాల వెనుక నుండి బాలభాస్కరుడు బంగారుకిరణాలతో మెరిసిపడుతుంటే అప్పటి ఆ దృశ్యం ఈస్టుమన్ కలర్ సినిమా సీనులాగుంది.

అలా ప్రకృతివంక చూస్తూ మైమరచి తన్మయురాలైన కాంత కాలాన్ని కూడ గుర్తించలేదు.

అంతలో బయటనుండి కారు హారన్ వినిపించేసరికి తృళ్ళిపడి ఈ లోకంలో పడింది. అప్పటికే రామారావ్ తనూ ఆనందంలో తండ్రికాబోతున్నావు అనే డాక్టర్ నోటివాక్కు వినేందుకు ఆతృతగా కాంతకన్నా ముందుగానే వచ్చాడు. కాంత వెళ్ళి కారులో కూర్చోగానే చిరునవ్వు నవ్విన భర్త ముఖం చూసి సిగ్గుతో తల దించుకుంది కాంత.

దేవిగారికి ఇప్పుడే ఇంత పరధ్యానమైతే రేపు బిడ్డ పుట్టాక భర్తనే మరచిపోతారేమో? అన్నాడు కాంత బుగ్గపై చిలిపిగా చిటికవేస్తూ. ఇద్దరూ చిలిపిగా ఒకర్నొకరు కవ్వించుకుంటూనే హాస్పిటల్‌కి చేరుకున్నారు.

కాంతను పరీక్షచేసిన డాక్టర్ సారధి రామారావును ప్రక్కకుపిలిచి ఏదో చెప్పేలోగ రామారావు ముఖంలో రంగులుమారాయి. డాక్టరుకు ప్రజెంటేషన్‌గా ఇచ్చేందుకు తెచ్చిన కేక్ పాకెట్టు అమాంతం జారి క్రిందపడగానే హాస్పిటల్ కుక్క ఒకటి వెంటనే వచ్చి పాకెట్టు కాస్త నోట్లో పెట్టుకుంది.

మనిషిలో కొత్తమార్పువచ్చిన రామారావు భార్యతో వచ్చి కారులో కూర్చున్నాడన్న మాటేగాని, మాటవరుసకు కూడా కాంతను మాట్లాడించలేదు.

ఈ మౌనాన్ని భరించలేని కాంత తనే_

ఏమండీ! డాక్టరుగారు ఏమన్నారు? అని అడిగింది. కానీ, కాంతమాట వినిపించుకోనని రామారావు పరధ్యానంగాఏదో ఎటో ఆలోచిస్తూ యాంత్రికంగా కారు నడుపుతున్నాడు.

అతని ముఖంలో చిరాకు, కోపాన్ని చూసిన కాంతకు కుడికన్ను అదురుతూ ఏదో కీడును శంకిస్తున్నది. ఇక అతడిని మాట్లాడించే ధైర్యంలేని కాంత మౌనాన్ని పాటించగానే ఇద్దరూ ఎడముఖం పెడముఖంగానే ఇల్లు చేరుకున్నారు.

అప్పటికే అలిసిపోయిన కాంత ఇల్లు చేరుకోగానే గదిలోకెళ్ళి మంచంపై ఒరిగిపోయింది,

కాంత కళ్ళు తెరచి చూసేసరికి గోడగడియారం రెండు గంటలు కొట్టింది. రోజూ ఆదరించి పదిగంటలకే అన్నం పెట్టే అత్తగారు అంతవరకు భోజనానికి పిలవడానికే రాలేదు. ఆప్యాయత చూపే ఆడపడుచూ రాలేదు. రోజూ దగ్గరుండి బుజ్జగించి అన్నం తినిపించే భర్త జాడ అసలే లేదు. చివరకు అడుగులకు మడుగు లొత్తే పనిమనిషి ఇటు ముఖంకూడా చూపకపోయేసరికి కాంతకు ఆశ్చర్యం కలిగింది. చివరికి తనే నిరంసంగా లేచి బయటికొచ్చింది.

బయటికొచ్చిన కాంతను చూడగానే అందరూ చూడరాని వస్తువునేదో చూస్తున్నట్టు చూస్తున్నారు.

ఇంట్లో పనిచేసే పనిమనిషితో సహా అందరూ అదోలాగ చూస్తూ వారంతా మానవ్రతం పట్టినట్టు ఇల్లంతా నిశ్శబ్దంగావుంది.

ఆ మానాన్ని చూస్తున్న కాంతకు మనస్సు చివుక్కుమంది. ఏమిటీ సస్పెన్స్?

ఎందుకిలా నన్ను చూడగానే ఇలా అసహ్యించుకుంటున్నారు?? ఇంతలోనే ఇంత మార్పేమిటి?

భగవంతుడా నేనేం పాపం చేసి పుట్టాను? అనుకుంటూ ఆగని ఆ దుఃఖంలో వెక్కి బోరున ఏడుస్తూ మంచంపై పడిపోయింది.

కాంత కంటినుండి ధారాపాతంగా కార్చిన కన్నీటికి తలగడ చాలవరకు తడిసిపోయింది.

దుఃఖసాగరంలో మునిగివున్న కాంతకు ఎప్పుడు చీకటి పడిందో తనకే తెలీదు.

అంతలోనే హాలులోంచి ఏవో మాటలు వినిపిస్తూంటే వినేఓపిక లేకపోయినా, వినగూడదనుకుంటూనే ఆ మాటలు వినసాగింది.

ఆ మాటలు విన్న కాంతకు కళ్ళముందు ప్రపంచమే గిర్రున తిరగసాగింది. తను నిల్చున్న భూమి భూకంపంతో బ్రద్దలై ఆ అగాధాలలోకి తను దిగబడి కూరుకుపోయినట్లనిపించింది. తలపై పిడుగుపడి వెయ్యి అగ్నిగోళాలు ఒక్కసారి పగిలి, రగిలి, రగలిన ఆ మంటల్లో కాంత జీవితమే మాడి మసైపోయినట్టు అలాగే నేలకు కూలింది. ఇక ఆ మాటలు వినలేక రెండు చెవులు మూసుకుంది.

భగవంతుడా ఏమిటీ అడుగడుగున ఈ అగ్ని పరీక్షలు?

ఇన్నిరోజులు నా కడుపులో పెరుగుతున్నది బిడ్డ అనుకున్నానుగాని, అది రక్తపుగడ్డని నాకేం తెలుసు! జీవితమనే జ్యోతిని వెలిగించి, వెలిగే జ్యోతికి కాంతి లేకుండా చేశావా?? చీకటినుండి వెలుగులోకి వస్తుందనుకున్న నా జీవితాన్ని అమాంతంగా అగాధంలోకి త్రోశావా??? ఇది నా దోషమా? లేక పూర్వజన్మ పాపమా??

నేను నీకుచేసిన అపరాధమేమిటి?
అడుగడుగునా ఈ చిత్రహింసలేమిటి??
చాలు ప్రభూ నాకీజీవితమే చాలు!
నేనీ పరీక్షలకు తట్టుకోలేను!!
ఈ అవమానాలను భరించలేను!

అందమైన అద్దాన్ని చేతికిచ్చినట్టే ఇచ్చి అమాంతంగా నేల కూల్చావు. పగిలిన గాజు పెంకుల్లాగ నా జీవితమే పగిలి ముక్కలైపోయింది.

గోరుచుట్టుపై రోకలిపోటులా బిడ్డలు లేరని కుమిలే నాకు ఈ రక్తపు గడ్డొకటా.

అంటూ రోదిస్తున్న కాంత కలువ పువ్వులాంటి కళ్ళల్లో నీరు కనుకట్టు నిండి ధారాపాతంగా నేల కారాయి. నిన్న ఆనందంతో నిద్రరాక ఈరోజు ఆవేదనతో నిద్రరాక మనస్సు తీరని బాధతో కొట్టుకుంటుంటే అచేతనరాలై పోయింది కాంత. ప్రకృతి అనే కాలం మాత్రం ఇవేవి తనకు పట్టనట్టు, తన కర్తవ్యాన్ని తను నిర్వర్తిస్తూ ఎవరికోసమూ, ఎందుకోసమూ ఆగకుండా మరో రాత్రిని వెనక్కు నెట్టింది... తెల్లవారింది.

ఇక సూర్యనివంతు రాగానే తన బంగారు కిరణాలతో కిలకిల నవ్వుతూ తూర్పు దిక్కున ఉదయించాడు. బాలభాస్కరుడు. ఆ వేకువనే శాశ్వతంగా బంధాలను తెంచుకున్న కాంత జీవితం అంటి పెరటి నూతిలో శాశ్వతంగా అస్తమించింది.

